# చీకటి బాటన పెనుగాలి పాట

శ్రీధర



అన్నీ మనం అనుకున్నట్లే జరుగుతాయని కాదు. అనుకోని సంఘటనలు కొన్ని ఎదురు కావచ్చు. మనఆలోచనలన్నీ తల్లకిందులు కావచ్చు. కష్టాల పరంపర వెన్నంటా, వెంటాడి వేధించనూ వచ్చు. అయితే అలాంటి సమయంలో ఎలాంటి మనిషి అయినా నిలువుగా కృంగిపోవటం సహజం. అదే ఆడదయితే, అందునా ఒంటరిదైతే కన్నీటి వరదలో కొట్టుకుపోక తప్పదు.

అనే అనుకున్నాను, సువర్చల దగ్గరకు వెళ్తూ. నిజానికి ఈ సమయంలో నాకు తెలియజేయటమే ఆశ్చర్యంగా ఉంది. ఒకటి రెండుసార్లు టెలిగ్రాం చదువుకుని మరీ బయల్దేరాను. నన్ను చూడగానే బావురుమని ఏడ్చే సువర్చలను ఎలా ఓదార్చాలా అని, నాలో నేనే దారిపొడుగునా రిహార్సల్స్ వేసుకున్నాను కూడా.

రిక్షా దిగి ఆయింటిలోకి వెళ్లేటప్పటికి కొంత వాతావరణం అర్థమైంది. ఫరవాలేదు కాస్త ఉన్నవాళ్ల ఇల్లులాగే ఉందనుకున్నాను. కానీ పొరపాటు పడ్డాను. తలుపు తీసిన పూర్వసువాసిని, నాకు పెరట్లోకి దారి చూపించింది. అక్కడొక రెల్లుగడ్డి పూరిల్లు ప్రత్యక్షమైంది. ఆ యింట్లోకి అడుగుపెట్టబోయే ముందు, మా ఊళ్ళో మామయ్య కట్టించుకున్న మేడ గుర్తొచ్చింది. ఆమేడలోని అలప్పైడి బొమ్మ, ఈ గుడిసె అంటే గుడిసే కాని చోట ఎలా ఉండగలుగుతోంది? ఏమో? ప్రేమ గుడ్డిదిట. గుడ్డిదేకాదు, సువర్చల విషయంలో మూగదీ, చెవిటిదీ, కుంటిదీ, అవిటిదీ కూడా. అంతకన్న మరో కారణం కనిపించదు.

లోపలికి అడుగుపెట్టగానే, సువర్చల కూర్చున్న చోటునుంచి చెంగున లేచి నిలబడింది. మట్టిగోడలు,తడికలతలుపుల మధ్యనున్న ఆ చిన్న గదిలో ఉన్న సామానంతా, ఆ నవారుమంచం ఒక్కటేననిపిస్తోంది. ఇంకేమున్నా ఉన్నా, అవన్నీ నామమాత్రంగానే ఉన్నయి. ఒక పక్కన తడిక పార్టిషన్ ఉంది. వెనకది వంటిల్లు కాబోలు. అందులోకి వెళ్లటానికి మంచం ముందునుంచీ సన్నని దోవ ఉంది. ఆ దోవ నిడివిలో సువర్చల నిలబడి,నన్నుమంచంమీద కూర్చోమంది. కూర్చుని చుట్టూ చూశాను. తడికలకు ఏనాటిదో,మాయాబజార్ లోని శ్రీకృష్ణుడు సినిమాబొమ్మ అతికించి ఉంది.సువర్చలకు సినిమాలంటే తగని పిచ్చి.

"టెలిగ్రాం అందిందా?" అని అడిగింది.

"నిన్న మధ్యాహ్నమేఅందింది. రాత్రి బస్సెక్కాను........" అన్నాను.

అన్నట్లు సువర్చల ఏడవటంలేదు! కంట తడిఅయినా లేదు. మామూలుగానే ఉంది. ఒక్కలోపం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. సువర్చల పచ్చని నుదుటిమీద దోసగింజంత ఎర్రని తిలకం ఎంతో శోభయమానంగా ఉండేది. ఇప్పుడా వెలితి చాలా చాలా స్పష్టంగా ఉంది. ముసిరే భ్రమరాల్లా తెల్లకలువల్లాంటి కళ్లకిరుప్రక్కలా కదిలే నల్లని ముంగురులు, నన్నెప్పుడూ కవ్విస్తూ ఉండేవి. ఇప్పుడీ సువర్చల జుట్టుకు నూనెరాసి రెండు రోజులయినా అయి ఉంటుంది .... రేగిపోయిన తల .... మనిషి కొద్దిగా వాళ్ళు చేసింది. పెళ్లయింది గదామరి.... అనుకున్నన్ని రోజులు పట్టలేదు ....

నాకో పెద్ద రిలీఫ్.... సువర్చల ఏడవటంలేదు, కాబట్టి ఓదార్చాల్సిన అగత్యం లేదు. కలిగిన కష్టానికి విచారించాల్సిన బాధ్యత మిగిలిపోయింది.

"ఇంత హఠాత్తుగా ఎలా పోయినాడు?"

"చెప్పుకోవటానికి పెద్ద జబ్బుగూడా ఏమీలేదు రెండురోజులు జ్వరంతగిలింది. తగ్గిపోతుందిలే అని తాత్సారం చేశాం. మూడోరోజు మధ్యాహ్నానికి బాగా ఎక్కువైంది. విపరీతంగా వాళ్ళు కాలిపోవటం ప్రారంభించింది. ఏదో సంధి ప్రేలాపనలా మాట్లాడటం మొదలెట్టాడు. భయంవేసి, ఇంటివారబ్బాయిని పంపించాను. కాంపౌండరుగారిని పిలుచుకొచ్చాడు. ఆయన ఇంజక్షను ఇస్తూనే ఉన్నాడు. ఇదుగో, ఈ మంచంమీదే, నువ్వు కూర్చున్నచోటే కూర్చుని ఉన్నాను. నా ఒళ్ళో తల పెట్టుకుని పడుకున్న మనిషి, ఇంక లేవనేలేదు....."

"ఈ కాంపౌండరు ఎక్కడ దొరికాడు మీకు?"

"ఈ చుట్టుపక్కలంతా ఆయనే వైద్యంచేస్తాడు. ఎంతిస్తే అంతే పుచ్చుకుంటాడు. చాలా మంచి మనిషి. ఇంతకీ

డాక్టర్లు మాత్రం దేవుళ్ళా? మన ఖర్మ ఇలా ఉంటే తప్పించటం వాళ్ల తరమా?" అని వేదాంతధోరణిలో ప్రశ్నించింది.

ఆ కాంపౌండరు చేసినది ఎంత ఘోర మైన తప్పో, తెలిసీ తెలియని వైద్యంతో రోగిప్రాణాలు ఎలా తీశాడో, ఆమె కెంత ద్రోహం చేశాడో కూడా తెల్సు కోలేక, పైగా ఆయన మంచివాడేనని, తన నుదుటి రాతే ఇందుకు కారణమని గుడ్డిగా నమ్ముతున్నది. అజ్ఞానమనే కటిక చీకటిలో నడుస్తున్న సువర్చల లాంటి వాళ్లను ఎవరు రక్షించగలరు?

తన భర్త తనను ఎంత ప్రేమగా చూసుకునేవాడో, తాను అతన్ని ఎంత గాఢంగా ప్రేమించిందో మరి కొంతసేపు వివరించింది. డబ్బు లేకపోయినా, తాము సుఖంగానే ఉన్నామన్న అభిప్రాయాన్ని కలిగించింది. అతను బ్రతికి ఉంటే, తన జీవితరథం పూలబాటన పయనించేదని, ఓర్చలేని విధి తనపై కక్ష తీర్చు కుంటున్నదని, దీర్ఘంగా నిట్టూర్చింది.

"మరి మీ వాళ్లకు ఎవరికీ కబురుచేయ లేదా!" అని అడిగాను. ఎంతయినా కన్న వాళ్లకు కడుపుతీపి లేకుండా పోతుందా?

సువర్చల సూటిగా నా కళ్లలోకి చూస్తూ అన్నది. "ఒకనాడు నేనే వాళ్లందరినీ వొదిలేసుకుని వచ్చేశాను, బావా.... ఎంత కష్టమొచ్చినా, చివరకు ప్రాణంమీదకు వచ్చినా, మళ్లీ ఆ గడప తొక్కకూడదని ఆ రోజే నిర్ణయించు కున్నాను. అయినవాడివి నీవొక్కడివే కనిపిస్తున్నావు...."

నేను అయినవాడినే. కావల్సిన వాడినే. కొంచెంలో తప్పిపోయింది. "మీ వాళ్ళు ఎవరిమీదా ఉంచలేని నమ్మకాన్ని, నా ఒక్కడిమీదే ఉంచావన్నమాట," అన్నాను, దాని మనసులో ఏముందో ఇంకాస్త విపులంగా తెల్సుకుందామని.

సువర్చల కొంచెం ఆగింది. ఆలో చించింది. నెమ్మదిగా అన్నది. "ఒకప్పుడు ప్రేమించిన మనిషివి కాబట్టి, నా తప్పుల్ని క్షమించేదయాగుణంకూడా నీకేఉంటుంది. ఇవాళ నేను ఇంత కష్టంలో ఉన్నానంటే, నిజంగా జాలి పడే మనిషివి నీవొక్కడివే నని నాకు అనిపించింది."

ఇప్పుడు నా ప్రేమను గురించి సువర్చల ఎందుకు గుర్తుచేస్తున్నట్లు? మాకు దగ్గిర బంధుత్వం ఉంది. దాన్ని మించిన స్నేహం ఉంది. చుట్టరికం గురించి గాని, స్నేహం గురించి గాని ప్రస్తావిస్తే నాకు వింతగా అనిపించక పోను.

"అదేం మాట సువర్చలా, కన్న బిడ్డవి, ఇంత నిరామయంగా ఇక్కడ పడి ఉన్నావని తెలిస్తే, మీ వాళ్ళ గుండెలు కరిగిపోవా? నా పాటిప్రేమ నీ మీద వాళ్ళకు లేదంటావా?" పెద్దరికం ఆపాదించుకుని, సువర్చలకు నచ్చజెప్ప బోయినాడు.

"ఆ ప్రేమాభిమానాలను మింగేసే పట్టుదలలు, కక్షలూ మా మధ్యకు వచ్చేశాయిగదా, బావా....వాళ్ళ దృష్టిలో నేను చచ్చిన దానిలోనే లెక్క. కులంచెడి భ్రష్టురాలినైపోయిన నన్ను చూడటానికే వాళ్ళకు మనసొప్పదు. అప్పుడు ఎవరి కోసం అవన్నీ పోగొట్టుకున్నానో, ఇప్పుడు ఆ వ్యక్తినీ పోగొట్టుకున్నాను. ఇంతకన్నా గొప్ప ఓటమి ఎవరికైనా ఏముంటుంది?"

"రక్తసంబంధం అనేది ఒకటి ఉంటుంది. ఆ సంబంధం ఉన్నవాళ్ళను ఎంత దూరంగా తరిమేసి తలుపులు బిగించుకున్నా, వాళ్ళు దూరంకారు, కాలేరు. గుండెగదిలో ఉండనే ఉంటారు, మనో వీధిలో మనల్ని వెన్నంటి వస్తూనే ఉంటారు. నువ్వన్న, ఆ గెలుపు ఓటముల తాలూకు సుఖదుఃఖాలనుమౌనంగా వాళ్లూ నీతో అనుభవిస్తూనే ఉంటారు. ఇది నిజం...."

"ఏమోలే....ఇంక ఏది ఏమైనా, నేను మళ్ళీ వాళ్ళ దగ్గరకు వెళ్ళదల్చుకోలేదు" అన్నది సువర్చల నిశ్చయంగా.

అదంత గట్టిగా చెబుతుంటే, ఇంక నేను దాన్ని మార్చలేనని తేలిపోయింది. అంతటితో ఆ ప్రస్తావన ఆగిపోయింది.

ఇంతలో మామ్మగారు కాఫీగ్లాసుతో ప్రత్యక్షమైంది. నేను కాఫీ తాగుతుండగా మూన్నాళ్ళముచ్చటగా గడిచిపోయిన సువర్చల సంసార జీవితంలోని మధుర ఘట్టాలను, ఆమెకు తెల్సినంతవరకూ వర్ణించింది మామ్మగారు.

తనకు నేను తప్ప ఇంకెవరూ లేరని, సువర్చల మామ్మగారికి చెప్పినట్లుంది. ఆమె ఇంక భారమంతా నాదేనన్నట్లు మాట్లాడింది. నేను కాదనీ అనలేదు, అవుననీ అనలేదు.

ఖాళీగ్లాసు తీసుకుని మామ్మగారు వెళ్ళిపోయింది. సువర్చల కూడా తడిక అవతలికి వెళ్ళిపోయింది. పది నిముషాల తర్వాత వచ్చి, నన్ను స్నానానికి వెళ్ళ మన్నది. స్నానంచేసి వచ్చాక, మళ్ళీ మంచంమీద వెనక్కి వాలాను. బహుశః ఈ మంచంమీద సువర్చల మొగుడు మాత్రమే నడుం వాల్చేవాడేమో. అతను ఉండగా నేను రాలేదు. వచ్చినా, సువర్చల పలకరిస్తుందో లేదోనన్న మీమాంస కూడా కలగకపోలేదు.

ఈ పెల్లిగ్రాం అంది, ఇక్కడకు వచ్చి చూసేదాకా, సువర్చల గురించి నేను ఊహించుకున్నదంతా వేరు.

ఇప్పుడింత దీనాతిదీనంగా కని పిస్తున్న సువర్చల, ఒకనాడు ఎంత దర్జాగా ఉండేదనీ? ఎలిజబెత్ టేలర్ కన్నా ఎక్కువ గర్వంగా ఉండేది. దానికేం తక్కువ గనుక. బంగారపు పోత పోసినట్లు మెరిసిపోతుండేది. ఇంక పయసు తెచ్చిన అందాలతో, పురివిప్పిన మయూరంలా మనోహరంగా కదలి వెళ్తుంటే, ముక్కు మూసుకుని కూర్చున్న మునీశ్వరుడైనా, కనుమరు

గయ్యేదాకా కళ్ళు అప్పగించి చూడాల్సిందే.

మా మామయ్య అప్పట్లో రెండు చేతులా ఆర్జించాడు. చూస్తుండగానే రెండు మేడలు కట్టించాడు. చిన్న కూతురు అయినందువల్ల, సువర్చలను అతి గారాబంగా చూసేవాడు. ఆ పిల్లనోట్లో మాట నోట్లో ఉండగానే, అది అడిగిన వస్తువు వాకిట్లో ఉండాలనేవాడు. అందుకు ఎన్ని నోట్లు ఖర్చయినా ఫరవాలేదనేవాడు. అంత అల్లారుముద్దుగా పెరిగిన పిల్లకు చదువు ఎక్కడ అబ్బుతుంది? పుస్తకాలు ముందేసుకుని కుదురుగా కూర్చోవడమంటే, దానికి గిట్టదు. పాఠాలు రావాలంటే, వొళ్ళొంచి చదవాలి గదా. కనీసం మెడవొంచి, చూడాలి గదా. ఠాట్, నే చదవను పొమ్మంది. అవును, ఆడపిల్లకు చదువెందుకూ అని అందర్నీ ఎదురు ప్రశ్నించాడు మామయ్య.

దానికదీ ఒక సమస్య కానేకాదుగాని, నాకు నచ్చిన చదువు, కొనాలంటే అదో పెద్ద సమస్య అయిపోయింది. నిజానికా సమస్య ఎదురు కాగూడదు. నాకు ఆసక్తి ఉంది, మామయ్యకు నన్ను చదివించే శక్తి ఉంది. ఎటొచ్చీ, చిన్న మాట పొరపాటు దగ్గర పంతాలకు పోయి, తెగేదాకా లాగటం జరిగింది.

"దాన్ని పెళ్ళిచేసుకో. నీ పేర పాతికవేలు బ్యాంకులో వేస్తాను. అది పెట్టి చదువుకో" అన్నాడు మామయ్య.

'అంటే మా మీద నమ్మకం లేదన్న మాట' అంటూ పెద్ద 'లా' పాయింటు లేవదీశాడు మా నాన్న.

జరిగిన మరో పెద్ద తప్పు ఏమిటంటే, వాళ్ళిద్దరూ ఎదురుపడి దీన్ని ఎలా పరిష్కరించాలీ అన్న చిత్తశుద్ధితో మాట్లాడుకోలేదు. మాటలు చేరవేసిన ఆడవాళ్ళు అగ్నిలో ఆజ్యంపోశారు.

ఏతావాతా జరిగిందేమిటంటే, నేను ఉన్న ఊళ్ళోనే ఉంటూ, కాలేజీలో మిడకసాగాను.

సువర్చల కాలక్షేపంకోసం సినిమాలకు వెడుతూ, నాకు కబుర్లు పంపేది. నా అసమర్థతకు నాకే చిన్నతనం అనిపించేది. తండ్రిమాట జవదాటకూడదా? నీ మాటే వింటాను మామయ్యా, కలకాలం నీతోనే ఉంటాను సువర్చలా — అని వెళ్ళిపోయిఉంటే, సువర్చల ఎంత సంతోషించేది?

మళ్ళీ, నాకే గుర్తుకొచ్చేది, నా భుజాల మీదనున్న బరువు. చదవాలి. ఏ గుమాస్తా ఉద్యోగమో సంపాదించాలి. దానితో, ఈ సంసారాన్నంతా లాక్కురావాలి. ఇంకెవరున్నారు, మరి? నా మీద అంత నమ్మకాన్ని పెట్టుకుని బ్రతుకుతున్న వీళ్ళందర్నీ నట్టేట వదిలేసి నా సుఖం నేను చూసుకోనా?

గదిలో కూర్చుని, నాలో నేను అంతర్యుద్ధం జరుపుకునే టప్పుడు సువర్చల వచ్చి నా కెదురుగా కూర్చునేది.

"ఇదివరకటిలా, నువ్వెందుకలా నవ్వుతూ ఉండటంలేదు ?" అని అడిగేది.

నిజమే, నేను నవ్వటం మర్చిపోయి మూడేళ్ళు అవుతోంది. అదొచ్చి గుర్తుచేసేదాకా, నాలో వచ్చిన మార్పు నాకే తెలియదు.

"నవ్వగలిగే స్తోమత ఉండాలిగదా?"

"ఏమిటి బావా, మనిషికి కావల్సింది డబ్బు ఒక్కటేనా?"

"ఈ ప్రశ్న మీ నాన్ననుగాని, మా నాన్ననుగాని అడిగితే, సమాధానం బాగా చెబుతారు."

సువర్చల నన్ను కవ్వించి నవ్వించాలని ప్రయత్నించేది. "నువ్వు ప్రాజెక్టులు కట్టలేకపోయినా, పడగొట్టటానికైనా పనికొస్తావనుకున్నాను..."

"నిజమేనే. నా ప్రాజెక్టులన్నిటినీ,—



నా భయాలతో, నా సందేహాలతో, నేనే పడగొట్టుకున్నాను..."

మాట మార్చేది. "కిటికీలోనుంచి చూడు, సాయంత్రం ఎంత బావుందో..."

"అటెందుకు, ఇటు. నా మొహంలోకి ఎప్పుడు చూసినా, ఇంక సూర్యాస్తమయాలే కనిపిస్తూ ఉంటాయి..."

"ఎందుకంత బాధ?" దాని కను రెప్పలకు దిగుళ్ళ పరదాలు.

"ఈ సంకెళ్ళను నువ్వయినా తెంచు, సువర్చలా" అని రెండుచేతులూ అందిస్తే, వాటిని మృదువుగా నిమురుతూ అడిగేది.

"నీకు సంకెళ్ళు ఏమిటి, బావా? ఏం నేరం చేశావని?"

"ఇవి పూల సంకెళ్ళు సువర్చలా....

ఫెడేల్‌మని తెంచితే, తెగిపోతాయి. కానీ ధైర్యం చాలటంలేదు..."

"ఏవీ, అసలు నాకేమీ కనిపించటం లేదే...?"

"అదే వీటి మహత్యం. డబ్బుగల వారి కంటికివి కనిపించవు."

నేను ఉద్యోగాన్వేషణకు బయల్దేరుతున్నాను. ఈ మధ్యనే సువర్చల లంగాలు, వోణీలు వెయ్యటం మానేసింది. అంటే అవి లేకుండా తిరిగిందని కాదు, చీరల్లోకి మారిందని. అది కట్టుకున్న చీర ఖరీదు రెండొందలు ఉంటుంది. రేపు ఇంటర్వ్యూకు వెళ్ళటానికి నాకు కనీసం ఇరవై రూపాయలు కావాలి. దాని ఒంటిమీద అధమపక్షం మూడువేల రూపాయల ఖరీదుచేసే సొమ్ము ఉంది. వెళ్ళాక ఒక నెలరోజులు అయినా, నిలబడటానికి మూడొందలైనా నాకు కావాలి.

"రేపు వెళ్ళిపోతున్నావుట గదా?" అని అడిగింది.

"అవును. నువ్వూ వస్తావా?" ఎందుకా పిచ్చి ప్రశ్న వేశానో నాకే తెలియదు. ఆ పిచ్చిపిల్ల మొహంలో ఈ చివరి నుంచి ఆ చివరిదాకా సంతోషం తళుక్కున మెరిసింది.

"నువ్వు రమ్మంటే ఎందుకు రాను?" అని అడిగింది నన్నే. అంతకంటే అవమానం ఏముంటుంది మీసమున్న ఏ మగాడికైనా. కానీ నేను అప్పటికే మీసాలు తీసెయ్యటం అలవాటు చేసుకున్నాను, అవసరమైనప్పుడు చూద్దాంలే అని.

ఏం మాట్లాడాలో తెలియక, టేబులు మీదున్న నా డైరీ తీసి, ఏవేవో అర్థం లేని మాటలు రాస్తూ కూర్చున్నాను. టేబులుకు రెండో వైపున సువర్చల కూర్చుంది. అటునుంచి ఇటు పిల్లగాలి తగులుతోంది. కాళ్ళకింద ఏదో మెత్తగా తగిలింది.

"అదే మంచిదేమో, బావా. మా నాన్న మన సంగతి ఆలోచించడు. నీ గురించి నేనేదన్నా చెప్పబోయినా, నీకేం తెలియదు, నోర్మూసుకో అంటాడు. ఇంకేం చెప్పను?" అని అడిగింది నన్నే.

"అవును. నోరుమూసుకో మన్నాడు గదా. ఎలా చెప్పటం?" అని బదులు చెప్పాను. డైరీలో రాస్తున్నాను. అందం ప్లస్ ఐశ్వర్యం ఈజిక్వల్టు ఆనందం. అందం ప్లస్ ఆనందం ఈజిక్వల్టు ఐశ్వర్యం. ఐశ్వర్యం ప్లస్ ఆనందం ఈజిక్వల్టు అందం.

"మన విషయం నువ్వయినా చెప్ప రాదా?" అని అడిగింది బయటపడేసి, టేబులుమీదకు వంగి.

"తెలియకపోతే గదా చెప్పటానికి." పేదరికం ప్లస్ ప్రేమ ఈజిక్వల్టు వైరాగ్యం ఈజిక్వల్టు కవిత్వం.

"ఎలా మరి, నువ్వు వెళ్ళిపోతున్నావు గదా..." కన్నుల కొలనుల్లో గిర్రున తిరిగిన సుడిగుండాలు.

"రెక్కలొచ్చిన పక్షికి, ఆహారం ఎవరు అందిస్తారు? అందరితోపాటు ఆ పక్షి ఎగిరిపోయి, తన ఆహార్నాన్ని వెతుక్కోవాలి..." ప్రేమ ప్లస్ దూరం ఈజిక్వల్టు వ్యామోహం... పుస్తకం మూశాను.

"మరి మన మాట ఏమిటి?"

"నాకేం లక్షలు లేవుగదా – కనీసం జీవితంమీద లక్ష్యాలైనా ఏర్పడలేదు గదా... నేనేమిటో నాకే తెలియని అయోమయంలో ఉన్నాను..." నా మాట పూర్తిగాకముందే సువర్చల లేచి నిలబడింది. జలజలమని రెండు కన్నీటి చుక్కలు రాలి, నా డైరీమీద పడి నాయి... తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. ప్రతి పేదవాడూ, తన ప్రియురాలికి చివరికిచ్చే ప్రియమైన కానుక ఇదే.... కన్నీటి ముత్యాల సరాలు!

ఆ తర్వాత మళ్ళీ దాన్ని చూడటం పడలేదు. రెండువందల మైళ్ళ దూరం వచ్చేశాను. ఎప్పుడైనా సాయంత్రం ఒంటరిగా గదిలో మిగిలిపోయినప్పుడు సువర్చల గుర్తు వచ్చేది. డైరీ తీసి, ఆనాడు రాసుకున్న మాటలన్నీ చదువుకునేవాణ్ని. వాటిక్రింద ఇంకో లైను రాయాలనేకోరికకలిగి కలంతీసుకున్నాను. ప్రేమ ప్లస్ దూరం ఈజిక్వల్టు వ్యామోహం ఈజిక్వల్టు నా మొహం.

ఒకరోజు రాజేశ్వరి రాసిన ఉత్తరం నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది! 'సువర్చల మన వీధిలోనే తిరుగుతుండే పాండురంగారావుతో లేచిపోయింది....' అతను ఎవరో నాకు ఎంతకీ గుర్తు రాలేదు. రెండు నెలల తర్వాత ఇంటికి వెళ్ళినప్పుడు రాజేశ్వరిని పక్కకు పిల్చి అడిగితే, అన్నీ చెప్పింది. నేను విన్న దాన్నిబట్టి, సువర్చల అయినవాళ్ళందర్నీ కాదని వెళ్ళినా, సుఖంగానే బ్రతుకుతోంది. కోరి చేసుకున్నందుకు అతనూ దాన్ని బాగానే చూస్తూండాలి. అది సరే సరి. మనుష్యుల్ని గుడ్డిగా నమ్ముతుంది. ఆ కాసేపూ ప్రేమతో ముంచెత్తుతుంది. ఎవరి ఇష్టాయిష్టాలమాట ఎలా ఉన్నా, అది కష్టపడకుండా బ్రతకడమే కావల్సింది – అని అనుకుంటూ వచ్చాను.

కాని ఇప్పుడు ఇక్కడి కొచ్చాక చూస్తే నా ఊహలన్నీ అపోహలని తేలిపోయినయి. సువర్చల ఈ పరిస్థితులలో ఎలా ఉండగలుగుతోందా అన్న ప్రశ్నే నన్ను వేధిస్తోంది. పైగా ప్రేమించి పెళ్ళిచేసికొన్న ప్రియుడు, ఇంత హఠాత్తుగా పోతే, దానికి ఉండాల్సినంత బాధఉన్నట్లు లేదు.

"నీకు మామ్మగారింట్లో వంట చేయిస్తున్నాను" అన్నది సువర్చల, నా దగ్గరగా వచ్చి.

"నీతో పాటే నేనూ...." అన్నాను.

"ఈ నాలుగు రోజులనుంచీ నేనూ అక్కడే...."

సువర్చల కూడా స్నానంచేసి, బట్టలు మార్చుకుని వచ్చింది. దాని వేషం, తీరు తెన్నులూ చూస్తే, పాండు పోయినందుకు చింతలేనట్లుగానే తోస్తుంది.

"అతనేదో ఉద్యోగం చేస్తున్నాడనుకుంటాను. అక్కడ రావల్సినవేమైనా ఉన్నాయా ?"

"ఏమో, అవన్నీ నాకు తెలియదు గదా. ఇంక జరగవల్సిందంతా నువ్వే చూసుకుంటావని నిన్ను పిలిపించాను....

ఆ మాటలు వినటానికి మామూలుగానే ఉన్నాయిగాని, వాటిని అర్థంచేసుకుంటే నా కర్తవ్యం ఎంత కష్టతరమైనదో తెలుస్తుంది. దీనికా చదువు రాదు. కనుక ఉద్యోగంరాదు. యవ్వనంలో ఉన్నదాన్ని వరసైనదాన్ని మాటవరసకు పలకరించినా తప్పుపట్టే సమాజం ఇది. యీ పరిస్థితుల్లో దీనికి కావల్సినవన్నీ నేనే చూడాలిట. ఎన్నాళ్ళు? పోనీ నేను ఎన్నేళ్ళయినా చూడగలిగినా, లోకం భరించగలదా ?

మామ్మగారు నాకు వడ్డిస్తూ, సువర్చల గురించే చెప్పుకొచ్చింది. అతని దగ్గర ఆ పిల్ల సుఖపడిన ఘడియలు లెక్కపెట్టొచ్చుగాని, కష్టపడిన రోజులు ఎన్నో లెక్కపెట్టలేమన్నది.

"అనుకోకూడదుగాని, అలాంటి సంసారం పగవాళ్ళకుకూడా వద్దు. అతను తెచ్చేదెంతో, తినేదెంతో, తాగేదెంతో అతనికే తెలియదు. ఆ పిల్ల మొహం చూసి ఇన్నాళ్లూ ఇంట్లో ఉండనిచ్చాను" అన్నది మామ్మగారు కూర వేస్తూ.

సువర్చలపట్ల ఆమె చూసిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపాను. ఇంకొంత అవసరంకూడా ఉందిగాబట్టి, మామ్మగారి యోగక్షేమాలు కూడా కనుక్కొన్నాను.

సుబ్బారావు ఆమెకు ఒక్కడే కొడుకు. చదువు సంధ్యలు ఏమీ అబ్బలేదు. కసరత్తులుచేసి కండరాలు పెంచడం అతని హాబీ. ఉద్యోగంకోసం చెప్పులు అరిగేలా




తిరిగి చివరికో ప్రెస్‌లో బైండింగ్ పని చేస్తున్నాడు. మరో మంచిఉద్యోగం కోసం ప్రయత్నాలు మానలేదు.

పాండురంగం పనిచేసే ఆఫీసుకు వెళితే, అంతా కాకుల్లా నన్ను ముసురుకున్నారు. అతనికి అక్కడ అప్పు ఇవ్వని వాడంటూ లేడు. అతను బ్రతికి ఉండగా తిరిగి వసూలు చేసుకున్న వాడంటూ కూడా ఎవడూలేడు. ప్రైవేటు కంపెనీలో టెంపరరీ ఉద్యోగం చేసే వాడు ఏం మిగులుస్తాడు ?

ఆ మాటే అంటే విని ఊరుకుంది సువర్చల.

"అతను నిన్ను అన్ని విధాలా భ్రష్టురాలిని చేయటం మినహా, నీకంటూమిగిల్చిందేమీ లేదు. గడిచినదంతా ఒకపీడకలగా మర్చిపోయి కొత్త జీవితం ప్రారంభించాలి. నీ కాళ్ళమీద నీవు నిలబడగలగటానికి కొంత టైం పడుతుంది. అంత వరకు చాలా శ్రమపడి చదువుకోవాలి. నీకు శ్రద్ధలేకపోయినా తప్పనిసరి. నీ కొక స్థితి వచ్చేదాకా, సాయంచేయడానికి నాకేమీ అభ్యంతరంలేదు. ఏమంటావు?" అని అడిగాను.

చెబుతున్నంతసేపూ సువర్చల రెప్ప ఆర్పకుండా నా వంకే చూస్తూ కూర్చున్నది. ఆ తర్వాత తలదించుకుని నెమ్మదిగా అన్నది. "నా అంతట నేను నిర్ణయాలు తీసుకొని చేసిన ప్రతిపనీ, నాకే హాని కలిగించింది. అందుకు కారణం బహుశః ఆకాశాన మెరిసే నక్షత్రాలకు అర్రులుచాస్తూ, కాళ్ళముందు ఏముందో చూసుకోకపోవటమే కావచ్చు. పైగా ఇప్పుడు నేను మానసికంగా చాలా దెబ్బ తిని ఉన్నాను. ఆయన ఉన్నంతవరకూ నాకు దేనిగురించీ ఆలోచించే అవసరం లేకపోయింది. అసలు చిన్నతనంనుంచీ నాకు అలాగే జరిగిపోయింది. అకస్మాత్తుగా ఆయన కనుమరుగైపోవటంతో నాకంతాఅయోమయంగాఉంది.పట్టపగలు కూడా చుట్టూ చిమ్మచీకటి వ్యాపించినట్లుగా వుంది. ఈ చీకట్లోలేచి ధైర్యంగా ఒక అడుగు ముందుకు వెయ్యలేకపోతున్నాను. చీకటి చాటున నిస్సహాయంగా నిలబడ్డ నాకు గుర్తుకొస్తున్న గతం వినిపిస్తున్న పెనుగాలిపాట నన్ను మరింత భయపెడుతోంది. బాగా అలిసిపోయినాను బావా. ఎంతగా అలిసిపోయినానంటే, ఇంక నాకంటివెంట ఒక్క కన్నీటి చుక్కగూడా కారటంలేదు...."

సువర్చల కన్నీరు ఇంకిపోవటానికి కారణం, తన భర్త మరణమేనని ఆమె నన్ను నమ్మించడానికి ప్రయత్నిస్తోంది. కానీ, అతనితో చేసిన సహజీవనమే ఒక

భయంకరమైన పిశాచంలా తోచిందనీ, అతను ఉన్నంతకాలం ఏడుస్తూనే ఉంది గాబట్టి ఇప్పుడు లోలోపల ఈ కొత్త మార్పును ఆహ్వానిస్తోందని నాకు అర్థ మవుతూనే ఉంది.

ఆ రోజు రాత్రి భోజనం చేస్తున్నపుడు మామ్మగారు నాకు మళ్ళీ గుర్తుచేసింది, తన కొడుకు ఉద్యోగం గురించి. అలాగే ప్రయత్నం చేస్తానని చెప్పాను.

"ఈ చిన్నసాయం చేశారంటే మేమూ అక్కడికే వచ్చి ఉంటాం. మాకు మీరు, మీకు మేమూ తోడుగా ఉండొచ్చు. పైగా ఇప్పుడు సువర్చల వొట్టిమనిషి కూడా కాదు. ముందు ముందు నెలలు దగ్గరపడే కొద్దీ, ఆడవాళ్ళ సాయం ఎంతో అవసరం...." అన్నది మామ్మగారు తన మామూలు ధోరణిలో మాట్లాడుతూ.

ఈ విషయం నాకు మరింత ఆశ్చ ర్యాన్ని కలిగించింది. దాన్ని చూసినప్పుడు నాకు అలాంటి అనుమానం రాలేదు. కనీసం అదయినా మాటమాత్రంగాకూడా సూచించలేదు. నేను చెయ్యికడుక్కోవ టానికి బయటకు వచ్చినప్పుడు సువర్చల సుబ్బారావుతో మాట్లాడుతూ, ములగ చెట్టుదగ్గర కనిపించింది. నన్ను చూసి గబగబా వచ్చేసింది.

"కాయలు ఏమైనా ఉన్నాయేమోనని చూస్తున్నాం" అన్నది పైగా. చీకట్లో అంత అవసరమేమిటని నేను అడగ లేదు.

శనివారం తాను భోజనం చెయ్యనని వచ్చి నా మంచందగ్గిరే కూర్చుంది.

"రేపు నేను వెళ్ళిపోతాను" అన్నాను.

"మరి నా మాట ఏమిటి?" అని అడి గింది. మంచం పట్టెమీద తల ఆనించి, నా వంకే చూస్తూ.

"అక్కడ నేను కొన్ని సర్దుబాట్లు చేసుకోవాలి. ప్రస్తుతం నేను బాబాయి వాళ్ళ ఇంట్లోనే ఉంటున్నాను. వెళ్ళాక, ఏదోఒక నెపంతో అక్కడినుంచి బయట పడాలి. వీలైనంతవరకు మరో చోటికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటాను. ఆ తర్వాత నిన్ను తీసుకువెళితే కొత్తచోట ఏమంత కష్టం ఉండదు...." అని చెప్పాను.

"మరి ఇదంతా జరిగి, మన కొత్త కాపురం పెట్టటానికి ఎన్నాళ్ళు పడుతుం దంటావు?"

"నువ్వు ఎంత తొందరపడుతున్నా, మరో నెలరోజులు ఆగాలి."

"నెలరోజులు నాకూ ఇక్కడ కొన్ని పనులున్నాయిలే."

"ఏమిటా పనులు?"

ఫలానా అని వెంటనే చెప్పలేక పోయింది. కొంచెం టైం తీసుకొని సర్ది చెప్పుకుంది. "ఇక్కడ ఇవ్వవలసిన వాళ్ళూ, తీసుకోవలసిన వాళ్ళూ ఉన్నారు గదా....ఎక్కడి రుణాలు అక్కడే తీర్చు కోటం నయంగదా...."

"మామ్మగారి అబ్బాయికి ఉద్యోగం చూస్తే వాళ్లూ మనతోటే వస్తారుట. ఆమె నీకు సాయంగా కూడా ఉంటానంది...." అన్నాను, ఇప్పుడయినా ఏమన్నా చెబు తుందేమోనని.

"ఇరుగూ, పొరుగూ అయి ఇక్క డంతా ఒక కుటుంబంలా కలిసి ఉన్నాం కాబట్టి, చనువుగా ఉన్నాం. ఇంక బ్రతికి నంతకాలం, వీళ్ళతోనే ఊరేగాలంటే కష్టంగదా....పైగా నాకు ఆవిడ చేసే సహాయం ఏముంది? నువ్వుమాత్రం ఎంత మందికి ఎన్ని ఉద్యోగా లిప్పిస్తావు?" అని అడిగింది.

"అంటే?"

"నేనొకదాన్ని నీకు భారంగా తయా రవుతున్నాను గదా?"

ఇంక ఆ విషయం నేను పొడిగించ దల్చుకోలేదు. తెల్లారాక ఊరికి బయల్దే రుతూ, మామ్మగారికి చెప్పిరావటానికి వెళ్లాను. ఆమె మళ్ళీ నాకు గుర్తుచేసింది, వాళ్ళబ్బాయి ఉద్యోగం గురించి, సువర్చలకు రానున్న అవసరం గురించీ.

సువర్చల నన్ను సాగనంపుతూ అన్నది...."ఉత్తరాలు రాస్తుండు. ఈనెల రోజులు ఇక్కడ ఎలాగో కాలక్షేపం చేస్తాను. అంతకన్నా ఎక్కువ రోజు లయితే కష్టం...."

అలాగేనని చెప్పి రిక్షా ఎక్కాను. ఊరికి వచ్చిన తర్వాత చాలా తీవ్రంగా ఆలోచించాను. నేను చేయబోయే పని ఎంతవరకు సమర్థనీయం అన్నది కాదు నాకు పట్టుకున్న సమస్య. సువర్చల మనస్సే నాకు అర్థం కాకుండా ఉంది.

ఇంక తప్పదు కాబట్టి ట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నం చేయసాగాను. అదేమంత కష్టమైన విషయంకాదు. బదిలీ చేస్తామని ఆఫీసువాళ్ళు బెదిరిస్తుంటే, ఆర్నెల్లనుంచి దాన్ని ఆపడానికి చక్రం అడ్డంపేస్తూ వచ్చాను. ఇప్పుడు నేను సరేనంటేరెండు రోజుల్లో కాపితం చేతికి వస్తుంది.

ఈ సందడిలో మరో వారంరోజులు గడిచింది. ట్రాన్స్‌ఫర్ రానే వచ్చింది. నాలుగయిదు రోజుల్లో వస్తున్నట్లు సువర్చలకు రాశాను. కానీ రెండురోజుల తర్వాత పిడుగులాంటి వార్త వచ్చింది. సువర్చల చనిపోయిందని, మామ్మగారు రాయించిన ఉత్తరం వచ్చింది. పరు గెత్తుకుంటూ వెళ్ళాను. నన్ను చూడగానే మామ్మగారు చిర్రున చీదేశింది.

"ఈ కాలపుపిల్లలు ఎప్పుడేం ప్రాణం మీదికి తీసుకొస్తారో తెలీదు బాబూ. నిక్షేపంలాంటి పిల్ల నిలువునా ప్రాణం తీసుకుంది...."

"దేనికి!"

"దేనికంటే ఏం చెప్పను? కడుపు పోవటానికి ఏం మింగిందో ఏమో...." ఆమె శోకాలు తీస్తూనే ఉంది.

నేను సుబ్బారావువంక చూశాను. తప్పుచేసిన వాడిలా తల దించుకున్నాడు.

..........